39 సంపూర్ణంగా అందచందాల్ని సొంతం చేసుకుని నిండు ప్రాయసోయగంతో మెరిసిపోతున్న 'విపుల' ఈ ఫిబ్రవరితో ముప్పై తొమ్మిదో వసంతంలోకి అడుగు పెడుతోంది. ఈ ఆనంద క్షణాలతోపాటు, ఫిబ్రవరిలో వచ్చే ప్రేమికులరోజును పురస్కరించుకుని ఈ నెల విపులను 'రొమాంటిక్ స్పెషల్'గా ముస్తాబు చేసి మీ ముందుంచాం. ప్రణయాక్షతలు జల్లి మనసారా ఆశీర్వదించమని మనవి.

– సంపాదకులు

సంపుటి : 39
సంచిక : 1
పేజీలు : 132
ఫిబ్రవరి : 2016
457 వ సంచిక

విపుల

విశ్వకథా వేదిక



-వెంచాశా

'వెళ్లొస్తాను'

"మీవాళ్లెవరైనా నిన్ను చూడాలనుకునే వాళ్లు ఉంటే చెప్పు"- అన్న జైలర్ ప్రశ్నకి సమాధానం వెంటనే దొరకలేదు సింహానికి, కాదు నరసింహానికి... నారమ్మ జ్ఞాపకానికి వచ్చింది. ఎవ్వరూ లేరు, ఎవ్వరూ రారు, నారమ్మ కూడా రాదేమో...

అయినా ఎందుకో ఇష్టం లేకపోయినా నారమ్మ పేరును ఉచ్చరించాడు నరసింహం- నాలుగు రోజుల క్రిందట... రావచ్చు రాకపోవచ్చు, ఎవరు వచ్చినా ఎవరు రాకపోయినా పరవాలేదు. ఎప్పుడో చచ్చిపోయిన నరసింహం మరో ఇరవై నాలుగు గంటలలో నిజంగా చచ్చిపోతున్నాడు.

ఇంక ఉన్నది ఒక పగలు, ఒక రాత్రి.

తెల్లవారింది. పగలు గడుస్తోంది. రాత్రి గడిస్తే తెల్లవారక మునుపే నరసింహం కళ్లు మూస్తాడు. అతని మెడను ఉరిత్రాడు కావలించుకుంటుంది. ఆప్యాయంగా హత్తుకుని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. కళ్లల్లోంచి గుడ్లు బయటికి వస్తాయి. ఒకే ఒక క్షణం. బాధలేని చావు. నిల్చున్నవాడు నిల్చున్నట్టుగా ఎనిమిదడుగుల లోతుకు ధడక్... మనే శబ్దంతో వెళ్తాడు. తల వాలిపోతుంది. ఉరిలో ఎంతహాయి. కత్తులు లేవు, కత్తిపోట్లు లేవు. రక్తపాతం లేదు, వేడి పచ్చినెత్తురు లేదు. ఎర్ర రంగు లేదు. ఒట్టి నీరసం చావు. ఇలాంటి చావులో సుఖం లేదు. చేతకాని చావు.

పట్టపగలే సూర్యుణ్ణి ఎవరో కత్తితో పొడిచారు. రక్తం చిమ్ముతున్నది. కత్తిపోట్లతో సూర్యుడి శరీరం కన్పించడం లేదు. రక్తం వర్షధారగా చిమ్ముతోంది. వేడిలో చల్లదనం. నెత్తురు చినుకులు వాడిగా బాకుల్లా భూమిని పొడుస్తున్నాయి. భూమిది ఉక్కు శరీరం. బాకుపోట్లు దిగడం లేదు. శబ్దం చేస్తున్నది మొరాయిస్తూ...

మనిషి శరీరం ఎంత మెత్తని... బాకుపోటు మెత్తగా శరీరంలోకి దూసుకుపోయేది, ఎదురు చెప్పకుండా. ఎన్ని పోట్లయినా సులభంగా దిగిపోతాయి. ఇటీవల

జీవితంలోంచే కథలు పుట్టాలి!

'జీవితంలో మనం నిత్యం చూసే వివిధ ఘట్టాలు, ఎందరెందరో వ్యక్తులు మనకిచ్చే ప్రేరణతో కథలు రాయాలి. కథలు జీవిత వాస్తవికతలోంచే పుట్టాలి' అని చావలి వెంకట శాస్త్రి గారు విశ్వసించి రాశారు. ఆధునికులలో మనో విజ్ఞానాన్ని, మానవత్వపు లోతులను తరచి చూసి, గొప్ప హృదయ స్పందనతో వస్తువు, శిల్పము కూడా నవ్యంగా సంతరించగల, నిర్వహించగల దిట్ట ఆయన. వృత్తిరీత్యా స్టేట్ బ్యాంక్ ఇండియాలో ఉద్యోగం చేస్తున్నా, ఆయన మానసిక ప్రపంచమంతా నిరంతరం సాహిత్య వ్యాసంగంతోనే నిండివుండేది. ఆయన కేవలం రచయితేగాక మంచి నటుడు, పెయింటర్ కూడా. రవీంద్రనాథ్ టాగోర్ రాసిన కాబూలీవాలాను నాటకంగా వేసినప్పుడు అందులో ఆయన ప్రధానపాత్ర పోషించారు. జ్ఞానపీఠ గ్రహీత రావూరి భరద్వాజతో పాటు ఎంతోమంది రచయితలతో ఆయనకు మిక్కిలి స్నేహం ఉండేది.



పూర్తి పేరు	:	**వెంచాశా** (చావలి వెంకట శాస్త్రి)
జననం	:	13 నవంబరు 1925, గుంటూరు జిల్లా నరసరావుపేట.
ప్రసిద్ధి	:	'వెంచాశా' కలం పేరుతో 17వ ఏటనే చిన్న కథలు, నాటికలు, విమర్శలతో ప్రారంభించి 1971నాటికి కనీసం మూడువందల వరకు కథలు రాశారు. వీరి కథలు అన్ని వార, పక్ష, మాస పత్రికల్లో ప్రచురితమయ్యాయి.
రచనలు	:	'షిఫాన్ సుందరి' అనే కథల సంకలనం 1985లో వచ్చింది. చీకటి, భూతం, ముసుగు, దారితప్పిన కథ, భగవంతుని కథ, సెమిటరీ అవతల సిమెంటు మేడ, త్రివేణి, పుత్రభేదం, కొవ్వొత్తి, ఆకుపచ్చని ప్రపంచం, మిగిలిన మనిషి, గాజులూ- గొలుసూ, వీలునామా, కాన్వొకేషన్ గౌను, రాయబారాలు, చితికిన గుండెలు, దొరల సెమిటరీ, జీవాత్మా-పరమాత్మా మొదలైనవి ఆయన రాసిన ప్రసిద్ధ కథలు
మరణం	:	ఫిబ్రవరి 15, 1982 తిరుపతిలో.

నరసింహం బాకుపోట్లకు గురైన సీతయ్య శరీరం తూట్లుపడి, వేడి, పచ్చి నెత్తురు చిమ్మింది. చిమ్ముతున్న నెత్తురు చూసి నరసింహం వికటాట్టహాసం చేశాడు. అప్పటికీ కసి తీరలేదు. పడిపోయిన సీతయ్యను కాలితో ఒక తన్ను తన్నాడు. సీతయ్య శవం కదిలింది. కానీ లేవలేదు. నరసింహానికి దాహం తీరలేదు. దాపునున్న తాటాకు పాకలోకి వెళ్లి దాహం తీర్చుకున్నాడు.

నరసింహం అంటే అందరికీ సింహస్వప్నమే. ఆ ఊళ్లో పోలీసులు కూడా భయపడ్తారు. చూసిన వాళ్లు సాక్ష్యం చెప్పడానికి పూనుకోరు. సింహం కలలోకి వచ్చినా భయమే. అంతా అయిపోయి మాటు మణిగిన తరువాత పోలీసులు విచారణకు వస్తారు. దాహం తీర్చుకున్న తరువాత సరాసరి పోలీసు స్టేషన్‌కు వెళ్లి- బాకు విసిరేస్తూ "ఇన్‌స్పెక్టరుగారూ ఇదిగో నే వచ్చాను, ఆ సీతాయిగాణ్ని చంపి. నా చేతులకు బేడీలు వేయండి" అన్నాడు. పోలీసువాళ్లు భయపడుతూ, భయపడుతూ బేడీలు వేశారు. బేడీలు ఒకదాన్ని ఒకటి రాసుకునేట్లు శబ్దం చేయిస్తూ పెద్దగా నవ్వాడు నరసింహం. ఆ నవ్వుకు పోలీసు స్టేషన్ దద్దరిల్లిపోయింది. నరసింహానికి శిక్ష పడినపుడు అందరిలాగా బాధపడలేదు. నేరం చేశాను. దానికి తగిన శిక్ష పడింది. ఇందులో బాధ పడేందుకేముంది? అనుకున్నాడు. అతని దృష్టిలో ఈ శిక్ష చాలా అల్పమైనది. ఎవరైనా తనను బాకుతో పొడిచి రక్తం చిమ్మిస్తే చాలా సంతోషించేవాడు. అంత సాహసానికి ఎవ్వరూ పూనుకోలేదు.

నిర్వహణ :

వేదగిరి రాంబాబు

అదే అతని బాధ. దెబ్బకు దెబ్బ, రక్తానికి రక్తం. నరసింహాన్ని ఎవరూ ఆ రకంగా శిక్షించలేకపోయారు. ఈ మనోవ్యథతో చాలా కాలం బాధపడి, విసుగెత్తి పోలీసులకు తనంతట తాను లొంగిపోయాడు, ఇక లాభం లేదనుకుని.

ఒకసారి ఊళ్లో పలుకుబడి ఉన్న పెద్దిరెడ్డిని బాకుతో పొడిచినపుడు- అదీ రహస్యంగా జరిగిపోయింది. పొలం నుండి తిరిగి వస్తున్నపుడు తను కాటేశాడు. ఎవరి కోసమో చేశాడు ఈ పని. ఎవరో ఈ పని చేస్తే ఇంత ఇస్తామన్నారు. పుచ్చుకుని బాకుకు పని చెప్పాడు. నరసింహాన్ని కావలిసిన వాళ్లు కావలసినట్టుగా ఉపయోగించుకున్నారు. నరసింహం పేరు బయటకు రాలేదు, పట్టుబడలేదు. ఎవరికోసమో కొంత మందిని చావకొట్టి చంపకుండా చెవులు మూసేవాడు. ఉగ్ర నరసింహాన్ని తాటాకు పాకలోని సీసాలు శాంతింపచేసేవి.

మీసాలు దువ్వుతూ నడి బజార్లో అంకమ్మ చెట్టు దగ్గర నిల్చుంటే నరసింహానికి ఎదురుగా ఎవరూ వచ్చేవారు కాదు. కత్తిపోటు కోసం ఎన్నోసార్లు ఎదురు చూశాడు. తన మీద కత్తి కాదుగదా కర్రైనా ఎవరూ విసర్లేదు. రక్తపు చినుకులు బాకుపోట్లు నెత్తురు ధారగా కురుస్తోంది, విధి విరామం లేకుండా. ఎదురు చూస్తున్న ముహూర్తం ఇంకా రావడం లేదు. క్షణం ఓ యుగంగా గడుస్తోంది. గడియారం ముల్లు నెమ్మదిగా కదుల్తోంది. కాలానికి కళ్లెం వేసినట్లయింది. ఒకవైపు బరువుగా, నెమ్మదిగా, చీమల్లే వెళ్తున్న పాములాంటి గడియారం ముళ్లు.. చావుకూ బ్రతుక్కూ తేడా కన్పించడం లేదు నరసింహానికి.

తనేదో నేరం చేసినట్టు నేరానికి శిక్ష అనుభవిస్తున్నట్టు అనుకోడం లేదు నరసింహం. ప్రయాణంలో ఒక మజిలీ అయి మరో మజిలీకి వెళ్తున్నట్టుంది. ఒక స్టేషన్లో దిగి కొంతకాలం బలాదూరు తిరిగి మరో స్టేషనుకు వెళ్లినట్టు. జైలు భోజనం

విభిన్న వైరుధ్యాలు కలబోసిన కథ



కథ మొదటి పేరాలోనే నాయకుడి పేరును 'సింహా' అని పరిచయం చెయ్యడంతోనే అతని వ్యక్తిత్వం తెలుస్తుంది. వృత్తిరీత్యా హంతకుడైన నరసింహం తన మనిషి నారమ్మని సీతయ్య కామించాడని భ్రమించి కిరాతకంగా చంపేసి, లొంగిపోతాడు. కర్మ చేసినవాడు ఆ కర్మ ఫలాన్ని అనుభవించాలనుకుంటాడు. జీవితంలో ఆఖరిరోజు కూడా జైలు భోజనాన్ని ఆస్వాదిస్తాడు. ఓ వేదాంతి హంతకుడిగా మారితే ఎలా ఆలోచిస్తాడో అలా ఉంటుంది అతని ధోరణి. అవతార సమాప్తిలో కర్మఫలం నిర్వికారంగా అనుభవించిన శ్రీకృష్ణ పరమాత్మతత్త్వం గుర్తుకువస్తుంది.

'వెళ్లొస్తాను' ఓ విలక్షణమైన కథ. దీనిలో నాలుగురసాల సమ్మేళనం కనబడుతుంది. భీభత్సం, భయానకం, శాంతం, శోకం కనబడతాయి. హంతకుడు రక్తపాతాన్ని ప్రేమిస్తాడు. అతనే నేరానికి శిక్ష అనుభవించాలనుకుంటాడు. కథ చివర సీతయ్య గురించి నారమ్మ చెప్పిన మాటలు కథకి పరాకాష్ట. 'వణుకుతూ వచ్చాడు. అల్లంత దూరానే ఉన్నాడు. తుపుక్కున ఊసేను మొహం మీద' అంటుంది. సీతయ్యకి నారమ్మని ఏమీ చేసే ధైర్యంలేదు. కానీ అతను నారమ్మను చెరబట్టాడని అనాలోచితంగా సీతయ్యని చంపేస్తాడు నరుడి శరీరంలో మృగమైన నరసింహ. అతని పరిధిలో న్యాయానికీ, శిక్షకీ తనే అధికారి. అతనో పరిమిత శిక్షాస్మృతిలో జీవించే వింత జీవి. మనిషిలోని ఇన్ని వైరుధ్యాలను చక్కగా చెక్కారు రచయిత. ఆనాటి ప్రధాన కథా స్రవంతిలో కనిపించే మరచిపోలేని, అతి అరుదైన కథ ఇది. ఈ కథలో చావలివారు వాడిన భాష సరళ వ్యవహారం. ఉపమాన ప్రయోగం విశిష్టంగా ఉంది. 'పట్టపగలే సూర్యుణ్ణి ఎవరో కత్తితో పొడిచారు' అంటారాయన.

– గంటి రమాదేవి (జి.ఎస్.శర్మ), కథకులు

చాలామందికి తృప్తిగా లేకపోయినా నరసింహానికి బాగానే ఉన్నది. ఆ వేళకు భోజనం చేశాడు మామూలుగానే. అతనిలో ఎలాంటి ఆందోళనా కన్పించడం లేదు.

వర్షం తగ్గలేదు. కాలం జరగడం లేదు. నరసింహానికి ఆలోచనలు ఏవీ రావడం లేదు. అతని కళ్లు శూన్యంలోకి చూస్తున్నాయి. అతని మెదడు వానలో తడుస్తున్నది. కోరికలు, ఆశయాలు, ఆందోళన, భయం, వణుకు, పశ్చాత్తాపం, నిద్ర, మెలకువ, కోపం, అసూయ, అహంభావం, పిరికితనం, ధైర్యం, అసహ్యం, ప్రేమ.. ఇవేవీ లేవు నరసింహానికి. ఇప్పుడు అతని మనసులో ఏం వుందో తెలియడం లేదు.

నరసింహం కోసం ఎవరో వచ్చారని కబురు వచ్చింది. నరసింహం చూశాడు.


వానలో తడిసి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ నారమ్మ వస్తున్నది. "కబురందింది. చూసిపోదామని వచ్చాను" అన్నది నారమ్మ నెమ్మదిగా.

వర్షంలో తడిసిన నారమ్మ వయసులో ఉన్నదే. తడిసి పోయిన చీరే, జాకెట్టూ వంటికి అంటిపెట్టుకుని శరీరపు నాజూకును వలకపోస్తున్నది.

నారమ్మది బీద బ్రతుకు. భగవంతుడిచ్చిన అందమూ, వయసూ ఆమె ఆస్తి. తడిబట్టలలోని సౌందర్యం కొట్టవచ్చేట్టుగా ఉన్నది. జైల్లో అక్కడ ఉన్న వాళ్లంతా ఆమె వైపే చూస్తున్నారు. విరాట్ రాజు కొలువుకు ఊరిబయట నుండి వస్తున్న, కేశ సంస్కారం లేకుండా, మాసిన బట్టలతో ఎంత దాచుకున్నా దాగని అందంతో ఉన్న ద్రౌపదిలా ఉంది నారమ్మ. ఆనాడు ద్రౌపది వస్తుంటే ఆమె ఎవరో తెలియక ఆమె అందానికి ఆశ్చర్యపడుతూ ఊళ్లో వాళ్లంతా గుమ్మం దగ్గర నిల్చుని మరీ చూశారు.

నరసింహం మాట్లాడలేదు.

"నిన్ను ఊళ్లో వాళ్లందరూ కలసి మోసం చేశారు" అన్నది నారమ్మ.



"నన్నా..   మోసమా.."
అన్నాడు నరసింహం.
"నేను నీ దాన్నయినప్పుడు మా
లోరు నన్ను కన్నెత్తి చూడడమే!
ఎవరికున్నై   అంతదమ్ములు"
అన్నది నరసమ్మ.
"సీతాయ్‌గాడు"

గాజీగాడు.

"సీతాయి ఏద"

నరసింహం పళ్లు కొరకలేదు. కత్తి దుయ్యలేదు. కళ్లు ఎర్రపడలేదు.

"నిన్ను ఉసిగొల్పేరు" అన్నది నారమ్మ.

"సీతాయి నీ దగ్గరకు రాలేదా?"

"వణుకుతూ వచ్చాడు. అల్లంత దూరంలోనే ఉన్నాడు. తుపుక్కున ఊసేను మొహంమీద.. నలుగురూ చేరారు. రభస అయింది. సీతాయి పరుగెత్తుతుంటే తరిమి తరిమి పట్టుకుని నీవు బాకు దూశావు, నెత్తురు చిమ్మింది"

అతను నారమ్మను చూస్తూనే ఉన్నాడు.

"నీ మనసు తెలుసు. మెత్తని గుండెగలోడివి. పట్టపగలు పదిమందిలో పౌరుషం చూపించావు. అందరి ప్రయత్నం ఫలించింది. నరసింహం విరగడ అయిపోనాదన్నారు. నేను ఎన్నాళ్లో ఏడ్చేను. ఏడ్చి ఏడ్చి ఇప్పుడు ఏడుపు రావడం లేదు. ఈ రాత్రికి సుఖంగా నిద్రపో. తెల్లారితే ప్రయాణం కోడి కూసేవేళ" అన్నది నారమ్మ. ఆమెలో కన్నీరు ఏనాడో వలికిపోయింది. తడి బట్టల్లోంచి నీటి చుక్కలు ఒక్కొక్కటీ భూమ్మీద బరువుగా పడుతున్నాయి.

"మంచి పనిచేశారు. నన్ను నడిబజార్లో ఎవరైనా చంపితే బాగుండేది. నా నెత్తురు చూసుకుంటూ కళ్లు మూసేవాణ్ణి. ఈ వెధవ చావు చావలేను" అన్నాడు నరసింహం.. చాలాసేపటికి మాట పెకల్చుకుని.

నారమ్మ వెనక్కు తిరిగి వెళ్లిపోబోతున్నది. "వస్తాను నరసింహా.. నేనెప్పుడూ నీదాన్నే" అంటూ నారమ్మ కదిలింది.

తడిబట్టల్లోంచి కన్పిస్తున్న ఆమె పిరుదులను, ఆ కదలికను చూస్తూ నిల్చున్నాడు నరసింహం. "వెళ్లొస్తాను నారమ్మా" అన్నాడు. ఒకసారి వెనక్కు తిరిగి చూసి మళ్లీ కదిలింది నారమ్మ.

ఏదో ఊరికి వెళ్తూ చెపుతున్న మాటల్లా ఉన్నాయి. నరసింహం వెళ్లొస్తానన్నాడు! తెల్లారేలోపున ప్రయాణం.